క్లుప్తంగా

నిత్యపూజకోనకు బస్సు సౌకర్యం కల్పించాలి

కడప కల్చరల్ : జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి సోమవారం నిత్యపూజ కోనకు బస్సు సౌకర్యం కల్పించాలని తాళ్లపత్ర గ్రంథ పరిశోధకులు నాగదాసరి మునికుమార్ ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. పుష్పగిరి క్షేత్ర రక్షణ కమిటీ ప్రతినిధి ఎస్.భారవితో కలిసి ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మంజుల కిరణ్‌కు ఆమె కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండులో బయలుదేరి 8 గంటలకు చేరుకునే విధంగా, తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు నిత్యపూజకోనలో బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు కడపకు చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్టీసీ బస్టాండు, పాతబస్టాండు, మాచుపల్లి బస్టాండు, టక్కోలి, మాచుపల్లి, మూలపల్లి, సిద్ధవటం, వంతాటిపల్లి మీదుగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఎన్నికల ప్రచారం

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువపల్లె, డీ కొత్తపల్లె, మైసూరారెడ్డి కాలనీ, పైడికాలువ పంచాయతీ పరిధిలోని గోసులవారిపల్లె గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



పోలీసు కవాతు నిర్వహిస్తున్న సీఐ నాగరాజు, కేంద్ర బలగాలు

పెండ్లిమర్రి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కడప రూరల్ సీఐ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నల్లయ్యగారిపల్లె, బాలయ్యగారిపల్లె, గొందిపల్లె, చీమలపెంట, జీసీపల్లె గ్రామాలల్లో పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు.

14న మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: అగస్త్యేశ్వరాలయంలో 14న ఆదివారం ఉదయం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోకకల్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

టీడీపీ నేతలవి ఊసరవెల్లి రాజకీయాలు

బి.కోడూరు: వలంటీర్లపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆ పార్టీ మండల స్థాయి నాయకులు ఎనలేని ప్రేమను చూపడం హాస్యాస్పదంగా ఉందని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని మేకవారిపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకు వలంటీర్ల గురించి అసభ్య పదజాలంతో ఇష్టానుసారం మాట్లాడి రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. టీడీపీ నాయకులు ఊసరవెల్లిలా వలంటీర్లపై కపట ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు తానా అంటే మండల టీడీపీ తందానా అంటున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చారని కొనియాడారు.

అన్నదానం

ప్రొద్దుటూరు: స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని శ్రీవీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో గురువారం బి.నాగేష్ యాదవ్, సుధ కుమారుడు అభిరనందన్ 8వ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, కార్యదర్శి శివప్రసాద్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయండి

బద్వేలు అర్బన్: ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్ సీఐ విక్రమసింహ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలతో రూరల్ సీఐ విక్రమసింహ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలైన తిరువెంగళాపురం, ఉప్పత్తివారిపల్లె, పుట్టాయపల్లె, గొడుగునూరు, అబ్బుసాహెబ్‌పేట, రాజుపాలెం, బయనపల్లెలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్



మజీదే బుకారియాలో దైవ సందేశం అందజేస్తున్న ఇమాం ఖతీబ్ సయ్యద్ సిరాజుద్దీన్ బుకారీసాహెబ్



మజీదే రోషన్‌లో ప్రార్థనలు చేయిస్తున్న హుస్సేనియా పీఠాధిపతి హజరత్ మౌలానా షహజాద్ హుస్సేనీసాహెబ్



దండు ఈద్గాలో బయాన్ ఇస్తున్న ఇమాం సయ్యద్‌షా అక్మల్‌పీరా మురాది సాహెబ్

ఈద్గాలు, మసీదుల్లో భక్తుల సందడి

కడప కల్చరల్ : రంజాన్ సందర్భంగా కడప నగరంలో ముస్లిం భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. స్థానిక గుర్రాలగడ్డలోని మజిదే హాజీరాబి మసీదులో గురువులు ప్రసంగించారు. మసీద్ ముతవల్లీలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఆలంఖాన్‌పల్లె దండు షాహీ ఈద్గాలో ముతవల్లి మురాదియా పీఠాధిపతి సయ్యద్‌షా జమాలుల్లా బాషా సాహెబ్ ముస్లింలతో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ప్రార్థనల్లో నగరానికి చెందిన పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

స్థానిక రవీంద్రనగర్‌లోని బుఖారియా మసీదులో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి ఈదుల్ ఫితర్ గురించి వివరించి ప్రార్థనలు నిర్వహింపజేశారు. ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రముఖులు, భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

నగర సమీపంలోని మాచుపల్లె గ్రామంలోని మైదానంలో ఈదుల్ ఫితర్ ప్రార్థనలు నిర్వహించారు. మానవులందరిలో శాంతి, సామరస్యం, సోదరభావం పెరిగి కలిసిమెలసి జీవించాలన్నారు. స్థానిక ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడప నగరం అల్మాస్‌పేటలోని మసీదుల్లో ఆయా మసీదుల గురువులు ఈదుల్ ఫితర్ భక్తులతో ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా పరస్పరం ప్రేమానురాగాలు, శాంతి సహకారాలతో జీవించాలన్నారు. ఒకరికొకరు అన్నట్లు జీవించినపుడే శాంతియుత సమాజం ఏర్పడుతుందని, దేశ పాలకులు క్షేమంగా ఉండి దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రార్థనల్లో నగర ప్రముఖులు, ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రార్థనల్లో కమలాపురం ఎమ్మెల్యే

కడప కల్చరల్ : రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. మామిళ్లపల్లిలోని హాలిమా సాదియా ఈద్గా మైదానంలో మత గురువు ముఫ్తీ రహీముల్లాఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు ఆరీఫుల్లాబాషా, ప్రసాద్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మజీదే కూబా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం భక్తులు

నడివీధి గంగమ్మ సన్నిధిలో హోమం



కలశాలతో మహిళా భక్తుల ఊరేగింపు



పూజా కార్యక్రమంలో భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రంలో జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 108 మంది భక్తులు పాండు రంగస్వామి ఆలయం నుంచి పవిత్రజలాల కళశాలతో మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. పవిత్రజలంతో అమ్మవారి మూలమూర్తిని అభిషేకించారు. అనంతరం క్షీరం, ఇతర ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేశారు. ఆవరణలో చండీ హోమం నిర్వహించి. పూర్ణాహుతి జరిపారు. అమ్మవారిని భక్తులందరూ దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కరుణించవమ్మా.. గంగమ్మా

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. జాతరకు వస్తున్న అమ్మవారి వెంట వేల సంఖ్యలో వచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామం మొత్తం భక్తులతో నిండిపోయింది. పోతురాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇతర జిల్లాల నుంచి కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. మొక్కుబడులు ఉన్నవారు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఏడాదంతా చల్లంగా చూడమ్మా అంటూ గంగమ్మను కోరారు.

– రాజంపేట టౌన్



పోతురాజును ఎగిరిస్తున్న భక్తులు



జాతరలో పాల్గొన్న ఆకేపాటి, పోలా



గంగమ్మకు గండదీయలు తీసుకొస్తున్న మహిళలు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్యప్రదర్శనలో చిన్నారులు



వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం శిల్పారామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షణలో శ్రీరాజా కళానిలయం శిష్యబృందంచే నిర్వహించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. రంజాన్ పండుగ కావడంతో ముస్లింలు పెద్ద సంఖ్యలో శిల్పారామాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న ఊయలలు, జారుడుబల్లలు, బోటింగ్ షికార్లు చేస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు.

వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో..

రంజాన్ పండుగ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పులివెందుల మహేష్ ఎస్‌కే ఫిల్మ్, స్టూడియో దీక్షు ఈవెంట్స్ ఆర్కెస్ట్రా సంయుక్తంగా జానపద, స్కిట్స్, సినీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముస్లిం సోదరులు లేక్ సందర్శనలో ఒకరికొకరు ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. హీరో పులివెందుల మహేష్, ఏపీ04 రామాపురం హీరో రామ్‌జాక్కల, యాంకర్స్ సాయిఈశ్వరి, సాత్విక, హనీలచే కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్‌లు రాజా, శర్వ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం

వీరపునాయునిపల్లె : రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అది వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సంగాలపల్లెలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని పథకాలు కొనసాగాలంటే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేస్తున్న అబద్ధపు హామీలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. తెలుగుదేశం నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారి మాటలు నమ్మొద్దని తెలిపారు. తెలుగుదేశం అధికారంలోకి రాదన్న విషయాన్ని వారికి తెలుసన్నారు. గతంలో టీడీపీలో కొనసాగుతున్న వారికే కండువాలు వేసి అనేక కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారని పత్రికల్లో రాయించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి



పాతసంగటిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

జగనన్నకే ఓటేద్దాం

పెండ్లిమర్రి : రాష్ట్రంలో ప్రతి ఇంటికి మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేసి గెలిపిద్దామని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం పాత సంగటిపల్లె గ్రామ పంచాయతీలోని చెన్నంరాజుపల్లె, చెన్నంరాజుపల్లె దళితవాడ, కోనాయపల్లె, పాతసంగటిపల్లె, పాతసంగటిపల్లె దళితవాడ గ్రామాల్లో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఏ ప్రభుత్వంలో అయితే మీకు మేలు జరిగిందో వారికే ఓటు వేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే మార్గం ఆదర్శనీయం

వైవీయూ : అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడంలో జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వైవీయూ పరిపాలన భవనంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలోని మనమందరం జ్యోతిరావు పూలే వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. పూలే ఆయన సతీమణితో కలిసి బాలికల విద్యకు, మహిళల అభ్యున్నతికి అనేక సంస్కరణలకు మూలాలుగా నిలిచారని కీర్తించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పూలే సంఘసేవకుడు, ఆలోచనాపరుడు, సంఘసంస్కర్త అని కొనియాడారు. మహిళా సాధికారత, వారి విముక్తి కోసం ఆయన కృషిచేశారన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనలో పూల కృషి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పూలే

కడప కార్పొరేషన్ : మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య అన్నారు. స్థానిక శంకరాపురంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే జీవితాంతం పరితపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సీఎస్‌ఆర్ మూర్తి, ఎస్. వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, డీఈలు రమణ, రెడ్డిశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైవీయూ అధికారులు



ట్రాన్స్‌కో కార్యాలయంలో..



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఎస్టీఎఫ్ నాయకుల నివాళి

కడప ఎడ్యుకేషన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబా పూలే అని, ఆయన ఆశయాలు, కార్యాచరణ స్ఫూర్తిదాయకమని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా కడపలోని ఎస్టీఎఫ్ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధిపత్య విలువలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మహిళల విద్యాభివృద్ధికి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శులు మదన్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. కడప నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్, వెంకటేష్, పాల్గొన్నారు.



జ్యోతిబాపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కుల వివక్ష పై అలుపెరుగని పోరాటం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశాన్ని పట్టిపీడిస్తున్న అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు నిరంతరం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు కొనియాడారు. నగరంలోని పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బత్తల లింగమూర్తి, గోవిందు నాగరాజులు మాట్లాడుతూ మహిళలపై సాంఘిక దురాచారాల సమస్యలు పోవాలంటే మహిళా విద్య అవసరమని గుర్తించి ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయించిన బీసీల ఆశాజ్యోతి పూలే అన్నారు. పూలే ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పునరంకితులు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ యాదవ్, ఉపాధ్యక్షుడు సుధాకర్, అంజి, ఆర్ల గంగయ్య, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహం, పల్లానరసింహారావు పాల్గొన్నారు.

బీసీ మహాసభ కార్యాలయంలో

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప జిల్లా బీసీ మహాసభ జిల్లా కార్యాలయంలో జిల్లా కన్వీనర్ పివి.రమణయ్య ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, రాయలసీమ ఎస్సీ ఎస్టీ హ్యూమన్ రైట్స్ వేదిక అధ్యక్షులు జేవీ.రమణజ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ భాస్కర్, జిల్లా కన్వీనర్ కదిరి ప్రసాద్, కడప నగర కన్వీనర్ ఎరుకలయ్య, శంకర్, గున్న జయరాం, బందెల ఓబయ్య, బాలరాజు పాల్గొన్నారు.